క్లుప్తంగా

బలపనూరు ఆర్‌బీకే తనిఖీ



వివరాలు ఆరా తీస్తున్న విజిలెన్స్ అధికారులు

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు గ్రామ ఆర్‌బీకేలో మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేపట్టారు. విజిలెన్స్ అధికారులు గుణకర్‌రెడ్డి, అలీఖాన్, గణేష్‌లు ఆర్‌బీకేలో జరుగుతున్న కార్యకలాపాలపై, రైతులకు అందిస్తున్న సేవలు, ఎరువుల నిల్వలు తదితర వాటిపై ఆరా తీశారు. ఎరువుల విక్రయాలకు సంబంధించిన రిజిష్టర్‌లో నమోదు చేసిన తీరు, ఖరీఫ్‌లో వచ్చిన ఎరువుల వివరాలు, వాటిని ఏ రైతులకు విక్రయించారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జయప్రకాష్‌రెడ్డి, ఎంపీఈఓ భవానీ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

గడివేముల: మండల పరిధిలోని ఒండుట్ల, పైబోగుల, ఎల్‌కే తండా గ్రామాలలో ముమ్మరంగా ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్నట్లు ఏపీఓ వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన ఒండుట్ల కుంటలో పూడితీత పనులు పరిశీలించడంతో పాటు గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తామన్నారు. అడిగినవారందరికీ పనులు కల్పిస్తామని, వలసలు వెళ్లాల్సిన పని లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాలను అందిస్తాం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తయ్యాక రైతులకు జగనన్న భూ హక్కు పత్రాలను అందజేస్తామని కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు భూములను రీ సర్వే చేసి రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేసేందుకు ఆధునిక డిజిటల్ రికార్డులను సిద్ధం చేస్తున్నామన్నారు. మంగళవారానికి మండలంలోని గ్రామాల్లో 43312.90 ఎకరాల్లో రీసర్వే పూర్తయిందని తెలిపారు. రీ సర్వే చేసిన తరవాత జారీ చేసిన రికార్డులను ట్యాంపరింగ్ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. సర్వేలో వీఆర్‌ఓలు, గ్రామ సర్వే సహాయకులు, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

29 నుంచి ఉరుసు

గూడూరు: మండలంలోని పొన్నకల్లులో వెలసిన అయ్యకొండ స్వామి ఉరుసు ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న గంధం, 30న ఉరుసు, 31న కిస్తీల ఉత్సవం నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

ఓటరు దినోత్సవం విజయవంతం చేయండి

సి.బెళగల్: మండలంలో బుధవారం నిర్వహించనున్న 13 జాతీయ ఓటరు దినోత్సవాన్ని మండల అధికారులు, బీఎల్వోలు విజయవంతం చేయాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం ఏర్పాటు చేసి జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఓటరు నమోదు, పౌరహక్కులు, బీఎల్వోల విధులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బుధవారం గ్రామాలలో చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలపై సూచనలు చేశారు.

శనగలో పంటకోత ప్రయోగం

సి.బెళగల్: మండల పరిధిలోని చింతమానుపల్లె గ్రామంలో మంగళవారం వ్యవసాయ అధికారులు శనగలో పంట కోత ప్రయోగం చేపట్టారు. ఏఓ మల్లేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఐదు ఇంటూ ఐదు చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రయోగం చేపట్టగా 3 కేజీల 190 గ్రాముల దిగుబడి వచ్చింది. ఈమేరకు ఎకరాకు దాదాపు ఆరు క్వింటాళ్ల శనగ పంట దిగుబడి సాధ్యం అవుతుందని, ఇది సాధారణ దిగుబడి అని వ్యవసాయ అధికారులు వెల్లడించారు. అదేవిధంగా బురాన్‌దొడ్డి గ్రామంలో పర్యటించిన ఏఓ కొర్ర పంటలను పరిశీలించి రైతులకు సంరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. గ్రామంలో వ్యవసాయ సిబ్బంది చేపట్టిన ఈ- పంట నమోదును పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం

కర్నూలు(అర్బన్): భారత దేశ 73వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకుందామని ఏపీ ఎస్సీ, ఎస్టీ లాయర్స్ ఫోరం అధ్యక్షులు వై.జయరాజు పిలుపునిచ్చారు. ఈ నెల 26న ఉదయం 10.30 గంటలకు స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు న్యాయవాదులు, వృత్తి నిపుణులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. భారత రాజ్యాంగం, దాని ప్రధాన లక్ష్యాల పట్ల నిబద్ధతతో ఉన్న వారందరిని ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 35వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కల్లూరు: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరి పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 35వ వార్డు 91వ వార్డు సచివాలయం పరిధిలోని ఉమామహేశ్వరమ్మ నగర్, అయ్యప్ప నగర్‌లలో స్థానిక కార్పొరేటర్ సాపురు మాధురి, వార్డు ఇన్‌చార్జ్ వీరయ్య ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని, సమస్యలు పరిష్కరించేందుకే మీ వద్దకు వచ్చానని ప్రజలతో పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సకాలంలో అందిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. కాగా డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాల సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ... సీఎం జగన్ రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నా టీడీపీ నాయకులు ఓర్వలేకనే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదంతా రాష్ట్రంలోని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. అర్హత కలిగిన వారందరికీ పార్టీలకు, రాజకీయాలకు, వర్గాలకు, మతాలకు, కులాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సాన శ్రీనివాసులు, వైజా అరుణ, మిద్దె చిట్టెమ్మ, సంగాల సుదర్శన్‌రెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, లక్ష్మిరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివ శంకర్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ జిల్లా ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ, నాయకులు రంగప్ప,జగదీష్,పెద్దన్న, గోపీనాథ్, హనుమంతురెడ్డి, సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీదేవి

పాణ్యం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పాణ్యం ఆయుర్వేద డాక్టర్ శ్రీదేవి అన్నారు. మంగళవారం పాణ్యంలోని చెంచుకాలనీలోని ఆశ్రమ పాఠశాలలో 'స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..చలి కాలంలో వచ్చే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చలి నుంచి రక్షణ పొందేవిధంగా దుస్తులు ధరించాలని, చర్మం పగలకుండా నువ్వుల నూనె రాసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం యోగా చేయడం వలన రోగాలకు దరిచేరవన్నారు. అనంతరం విద్యార్థులతో యోగా చేయించారు. కార్యక్రమంలో యోగా ఉపాధ్యాయురాలు అనురాధ, ఎంఎల్‌హెచ్‌పీ స్వరూప, పాఠశాల ప్రిన్సిపాల్ సునందలక్ష్మి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మకు పూజలు





ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మతల్లి , అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తజనం

కర్నూలు (న్యూటౌన్): వెంకాయపల్లె ఎల్లమ్మ తల్లిని దర్శించుకునేందుకు మంగళవారం తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు. ప్రతి వారంలాగే ఈ వారం కూడా జిల్లా నుంచే గాక వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అమ్మవారికి అభిషేకం చేసి, పట్టు వస్త్రాలు సమర్పించి రకరకాల పూలు, నిమ్మకాయల దండతో అలంకరించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా దేవస్థానం ఈఓ సీతారామిరెడ్డి పర్యవేక్షించారు.

తాగునీటి సమస్య పరిష్కారం



చింతలపల్లెలో కుళాయి కనెక్షన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: మండలంలోని చింతలపల్లె గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం గ్రామంలో నిర్మించిన పైపులైన్, కుళాయి కనెక్షన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, గ్రామ సర్పంచ వెంకటరమణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల విన్నపం మేరకు మొత్తం రూ.9 లక్షలతో పైపులైన్ నిర్మాణం పూర్తి చేసి, పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే ప్రజలు పంచాయతీ నిబంధనల ప్రకారం ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ రామసుబ్బారెడ్డి, గ్రామ నాయకులు గిడ్డయ్య, హుసేనాపురం సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పూర్తి చేయండి



మాట్లాడుతున్న డీడీఓ బాలకృష్ణారెడ్డి

ఓర్వకల్లు: సచివాలయాల పరిధిలో ఇంటింటి సర్వేను పూర్తి చేయాలని డివిజనల్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని హుసేనాపురం, కాల్వ గ్రామ సచివాలయాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హుసేనాపురం సచివాయం-2లో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. కల్యాణమస్తు పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ కార్డులు ఇప్పించడం, 5 నుంచి 15 ఏళ్ల వయస్సు గల వారికి తప్పనిసరిగా బయోమెట్రిక్ పూర్తి చేయాలని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది క్రమం తప్పకుండా బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. హైరిస్కు గర్భిణులను గుర్తించి ఐరన్ సుక్రోజ్, కాల్షియం మాత్రలు పంపిణీ చేయాలన్నారు.

వంద శాతం ఫలితాలు సాధించాలి

కర్నూలు కల్చరల్: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని కర్నూలు ఉప విద్యా శాఖాధికారి, కోర్స్ డైరెక్టర్ కె.హనుమంతరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ హైస్కూల్‌లో కర్నూలు డివిజన్‌లోని అన్ని మండలాలు, పత్తికొండ, దేవనకొండ మండలాల గణితశాస్త్రం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం పాఠశాల సహాయకులకు ఒక రోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. వెనకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓరియెంటేషన్‌లో ప్రతి సబ్జెక్టుకు ఇద్దరు ఉపాధ్యాయులు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. టౌన్ మోడల్ స్కూల్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఇనాయతుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముఖ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వండి



డైరీని విడుదల చేస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ రామచంద్రయ్య

కర్నూలు(అగ్రికల్చర్): క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న పశుసంవర్ధకశాఖ పారా సిబ్బందికి ప్రభుత్వం కొత్త గా అమలు చేస్తున్న ముఖ హాజరు నుంచి మినహా యింపు ఇవ్వాలని ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ 2023 డైరీని జేడీ డాక్టర్ రామచంద్రయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా చైర్మన్ మాట్లాడుతూ... క్షేత్రస్థాయి సిబ్బంది ముఖ హాజరు వల్ల ఇబ్బందులు పడుతున్నారని జేడీ దృష్టికి తెచ్చా రు. ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో జేవీవో, వీఎల్‌వో అసోసియేషన్ నాయకులు రంగన్న, జనార్దన్‌రెడ్డి, బాబురావు, యూసు ఫ్, ఆదినారాయణమ్మ, సులోచనమ్మ, శ్రీరాములు, సుబ్బరాయుడు, సహ అధ్యక్షుడు సుధాకర్, వీఏ నాయకులు లక్ష్మీదేవి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

డీఈఈకి బాధ్యతల కేటాయింపు

కర్నూలు (టౌన్): మూడు నెలల పాటు మెడికల్ లీవ్‌లో ఉన్న నగరపాలక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాధాకృష్ణ మంగళవారం విధుల్లో చేరారు. ఆయనకు విధులను కేటాయించారు. నగర పాలక సంస్థ పరిధిలోని పాణ్యం, కోడుమూరు అర్బన్ పరిధిలో ఎలక్ట్రికల్ పనులు, విలీన గ్రామాలతో పాటు 26వ వార్డు నుంచి 32వ వార్డు పరిధిలో సివిల్ వర్క్స్, వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్లు, శ్మశాన వాటికలు, పాఠశాలలు, కమ్యూనిటీ భవనాలు, టాయిలెట్లు, పార్కుల అభివృద్ధి, ఖాళీ స్థలాల పర్యవేక్షణ వంటి బాధ్యతలు అప్పగిస్తూ నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఉత్తర్వులు జారీ చేశారు.

బాలికల భద్రత అందరి బాధ్యత



సి.బెళగల్ మోడల్ స్కూల్‌లో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సి.బెళగల్: బాలికల భద్రత అనేది సమాజంలోని అందరి బాధ్యత అని మోడల్ స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ధనుంజయగౌడ్ అన్నారు. మంగళవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు బాలికల రక్షణ, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లలకు ఎక్కడైన సమస్యలు ఎదురైతే ధైర్యంగా ఎదుర్కోవాలని, అవసరమైతే పోలీస్‌లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాలలోని పాఠశాలల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు ఆటల పోటీలు, చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ఓర్వకల్లు: సమాజంలో జరుగుతున్న బాల్య వివాహాలను అరికట్టాలని జెడ్పీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు శివరాం అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని నన్నూరు అంగన్‌వాడీ కేంద్రాలలో కిశోర బాలికల సంరక్షణ, పోషణ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునీత, ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం శివరాం మాట్లాడారు. బాలికలలో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



నన్నూరులో పిల్లలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కల్లూరు: స్థానిక ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహబుబ్‌బీ, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వలసలు అరికట్టాలి

గూడూరు: మండలంలో వ్యవసాయ కూలీలు వలస వెళ్లకుండా ఉపాధి పనులు పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని చనుగొండ్ల గ్రామ సచివాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ మండలంలో అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్న కూలీల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ పనులు పెంచి కూలీలు వలస పోకుండా చూడాలని కోరారు. అనంతరం సచివాలయ కార్యదర్శి మధుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, మాధవ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

నవోదయ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కల్లూరు: జవహర్ నవోదయ విద్యాలయ సమితి 2023-24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఈ నెల 31వ తేదిలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. సీట్ల రిజర్వేషన్ ప్రక్రియ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం కేటాయిస్తారన్నారు. 33శాతం సీట్లను బాలికలకు కేటాయించినట్లు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు

కర్నూలు (టౌన్): సెలవుల్లో ఉంటున్న సచివాలయ ఉద్యోగుల స్థానాల్లో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ ఇతర సచివాలయాల ఉద్యోగులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇందిరాగాంధీనగర్-1 సచివాలయానికి రాచపూడి విద్యాసాగర్, ఇందిరాగాంధీ నగర్ -2 సచివాలయానికి రాచపూడి విద్యా సాగర్,జెఎస్ఆర్ నగర్ సచివాలయానికి డి.సౌజన్య, మంగళగేరిలో ఉన్న సచివాలయానికి ఎస్.శ్రీజ, పందిపాడు సచివాలయానికి బోయ రామనాయుడుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

26న జంతువధ నిషేధం

కర్నూలు (టౌన్): ఈ నెల 26వ తేదీ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నగర పాలక సంస్థ పరిధిలో అన్ని మాంసం, చికెన్, చేపల దుకాణాలను బంద్ చేయాలని నగరపాలక సంస్థ పశువైద్యాధికారి డాక్టర్ బి.మల్లన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అతిక్రమించి మాంసపు దుకాణాలు తెరచి అమ్మకాలు చేపడితే భారీ జరిమానాలు, ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. జంతువధ నిషేధానికి వ్యాపారులు సహకరించాలని కోరారు.

షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ



ట్రోఫీని అందుకుంటున్న గురుకుల కళాశాల విద్యార్థులు

కల్లూరు: జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు డాక్టర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. బెంగళూరులోని కంటిరావా స్టేడియంలో ఈ నెల 20 నుంచి 23 వరకు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఏపీ తరుపున చిన్నటేకూరు గురుకుల కళాశాల విద్యార్థులు ఉపేంద్ర, మణి, మునేంద్ర, అఖిల్, హనుమేష్, సాగర్‌లతో పాటు పంజాబ్ రాష్ట్రానికి చెందిన మరో ఆరుగురు ఒక జట్టుగా పాల్గొని ఢిల్లీ, సిక్కిం జట్టుపై విజయం సాధించారు. ఈ నేపథ్యంలో మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామసుబ్బారెడ్డి, అధ్యాపక బృందం విద్యార్థులను, పీడీ చంద్రశేఖర్, పీఈటీ కిరణ్‌లను అభినందించారు.

గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

ఓర్వకల్లు: గ్రామాలలో అల్లర్లు, గొడవలకు పాల్పడకుండా ప్రశాంత వాతారణంలో జీవించాలని సీఐ శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో రోడ్డు భద్రత, చదువు యొక్క ప్రాధాన్యతపై సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భూ తగాదాలు ఉంటే రెవెన్యూ అధికారులతో సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, ఒంటరి మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జున, పోలీసులు వీరారెడ్డి, బలరామ్, దాసు, గ్రామస్తులు భాస్కర్‌రెడ్డి, మాదన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

కర్నూలు(హాస్పిటల్): జీవనశైలి మార్పులతో వ్యాధుల నిర్మూలన సాధ్యమని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆయుష్ దత్తత గ్రామమైన కర్నూలు మండలం పసుపలలో మంగళవారం ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలబాలికలకు, ఉపాధ్యాయులకు ఆరోగ్య సూత్రాలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ వై.అనురాధ, ఉపాధ్యాయులు ఎం .సుకన్య కుమారి, బి.వెంకటేష్ పాల్గొన్నారు.

రసవత్తరంగా వాలీబాల్ పోటీలు



క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడుతున్న శ్రీకాకుళం, పశ్చిమగోదావరి జట్లు

కర్నూలు (టౌన్): రెండు రోజులుగా స్థానిక మాంటిస్సోరి పాఠశాల క్రీడామైదానంలో జరుగుతున్న 66వ రాష్ట్ర స్థాయి అండర్-17 వాలీబాల్ బాలబాలికల పోటీలు మంగళవారం రసవత్తరంగా సాగాయి. సెమీఫైనల్స్‌కు శ్రీకాకుళం, పశ్చిమగోదావరి (బాలుర విభాగం), విజయనగరం, విశాఖపట్నం జట్లు (బాలికల విభాగం) చేరుకున్నాయి. కాగా క్వార్టర్ ఫైనల్ బాలుర విభాగం పోటీల్లో అనంతపురం జట్టుపై శ్రీకాకుళం 25-23, 27-25 స్కోర్, కృష్ణ జిల్లా జట్టుపై పశ్చిమగోదావరి జిల్లా జట్టు 25-20, 25-13 స్కోర్‌తో గెలిచాయి. బాలికల విభాగంలో అనంతపురం జట్టుపై 25-21, 25-20 స్కోర్‌తో విజయనగరం జట్టు, వైఎస్సార్ జిల్లా జట్టుపై విశాఖపట్నం జట్టు విజయం సాధించాయి. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

గూడూరు: పట్టణంలోని పడమర బీసీ కాలనీలో బుధవారం(నేడు) గడప గడపకు మన ప్రభు త్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మంగళవా రం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతారని, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు గీతాముఖర్జీనగర్‌లో 'గడప గడపకు'

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 38వ వార్డు గీతాముఖర్జీనగర్‌లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరుకానున్నట్లు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సుంకులమ్మను దర్శించుకున్న ఎంపీ

గూడూరు రూరల్: మండలంలోని నాగులాపురం సుంకులమ్మను హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కురువ సంఘం నాయకులు ఎంపీకి ఘన స్వాగతం పలికారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గడివేముల: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓ ఉషారాణి మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదివే విద్యార్థులకు ప్రతి వారం వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ హాస్టల్ వార్డెన్ వెంకటపతి, హెల్త్ అసిస్టెంట్ విజయభారతి, ఆశావర్కర్లు చెన్నమ్మ, ఆశాబీ పాల్గొన్నారు.